క్లుప్తంగా...

సోచ్ నుంచి కొత్త కలెక్షన్

సాక్షి, సిటీబ్యూరో: ఎత్నిక్ వేర్‌కు ప్రసిద్ధి చెందిన సోచ్ బ్రాండ్ రెడ్ డాట్ కలెక్షన్‌ను అందుబాటులోకి తెచ్చింది. వేసవి సీజన్‌కు సప్పేలా, కాటన్ సిల్క్, సిల్ బ్లెండ్, జార్జెట్స్‌తో తయారైన చీరలు, సల్వార్ సూట్లు, కుర్తీలు, టునిక్స్ తదితర కలెక్షన్లతో.. రెడ్ డాట్ సేల్‌ను అందిస్తున్నామని నగరంలోని తమ అన్ని ఎక్స్‌క్లూజివ్ షోరూమ్స్‌లో ఇవి అందుబాటులో ఉన్నాయని బ్రాండ్ ప్రతినిధులు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరాలతో రోగులకు మేలు



రోగులను పరీక్షిస్తున్న వైద్య బృందం

పోచారం: వైద్యాన్ని అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు వైద్య శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి అన్నారు. నారపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో నీలిమ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని చైర్మన్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వైద్య శిబిరాలతో రోగులకు మేలు జరుగుతుందన్నారు. శిబిరంలో 390 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రెడ్యా నాయక్, కౌన్సిలర్ మోటుపల్లి పోచమ్మ, కోఆప్షన్ సభ్యుడు అక్రం అలీ, బీఆర్ఎస్ పోచారం మున్సిపాలిటీ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శేఖర్, వైద్య బృందం తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణంపై అవగాహన



గ్రామస్తులతో మాట్లాడుతున్న విద్యార్థులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు కండ్లకోయ గ్రామంలో పర్యటించారు. మిషన్ లైఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించారు. గ్రామంలోని సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పర్యావరణం, వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి టీవీ రెడ్డి, డైరెక్టర్ సరోజారెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీలత, పీఆర్వో రవిసుధాకర్, ఏఓ ప్రభాకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రాజేశ్, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల్లో నాణ్యత ఏదీ..?



అంకుషాపూర్-ఎన్ఎఫ్‌సీనగర్ రోడ్డును పరిశీలిస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: కమీషన్ల కోసం రోడ్డు పనుల్లో నాణ్యత పాటించడం లేదని ఎంపీపీ సుదర్శన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అంకుషాపూర్-ఎన్ఎఫ్‌సీనగర్ రోడ్డును ఎంపీటీసీ శోభారాణితో కలిసి ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు పనుల కోసం గతంలో బీజేపీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టామని, కానీ ప్రస్తుతం చేపడుతున్న నాణ్యత లేని రోడ్డు పనులతో లాభం లేదన్నారు. స్థానిక మంత్రి అభివృద్ధిని గాలికి వదిలేశారని ఆరోపించారు. రోడ్డు పనుల విషయమైన జిల్లా పరిషత్ ఈఈకి సమాచారం ఇచ్చామని, నాణ్యత లోపిస్తే కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. శ్రీనివాస్, లాలయ్య, బస్వరాజ్, హరినాథ్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ కరాటే డే



అంతర్జాతీయ కరాటే దినోత్సవంలో విద్యార్థులు

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని సంస్కృతి టౌన్‌షిప్‌లో జపాన్ కరాటే అసోసియేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా అంతర్జాతీయ కరాటే దినోత్సవం జరుపుకున్నారు. తెలంగాణ రాష్ట్ర చీఫ్ రాపోలు సుదర్శన్ పిలుపు మేరకు 100 మందికిపైగా కరాటే విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ర్యాలీ నిర్వహించారు. 'ఆత్మరక్షణ మన హక్కు.. కరాటే నేర్చుకుందాం .. సమాజానికి దోహదపడదాం..' అనే నినాదాలతో కరాటే ప్రాముఖ్యత గురించి ప్రజలకు తెలియజేశారు. అసోయేషన్ జిల్లా అధ్యక్షుడు గుగులోత్ గోవింద్ నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఆర్.సంతోష్, సభ్యులు ఎస్.నాగరాజు, ఆర్.కీర్తన, ఎస్.కిరణ్, జి.అక్షయ్ కుమార్, హెచ్.అజిత్, పి.అవనీస్ తదితరులు పాల్గొన్నారు.

హరితోత్సవానికి వేళాయే..

- దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా.. నేడు 50 వేల మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు
- కలెక్టరేట్, నారపల్లి అర్బన్ పార్కు, జీపీలు, పురపాలికల్లో గుంతలు సిద్ధం
- ఈ ఏడాదిలో హరితహారం లక్ష్యం 63.70 లక్షల మొక్కలు



కలెక్టరేట్ ఆవరణలో పెద్దఎత్తున మొక్కలు నాటేందుకు గుంతలు సిద్ధం చేస్తున్న కార్మికులు

సాక్షి, మేడ్చల్ జిల్లా: నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో తొమ్మిదో విడత హరితహారం మొక్కలు నాటేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ప్రతి సంవత్సరం వర్షాలు కురిసిన తర్వాత మొక్కలు నాటేవారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 19న(సోమవారం) 'హరితోత్సవం' పేరిట మొక్కలు నాటేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అందులో భాగంగా జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ ఆదేశాల మేరకు మేడ్చల్ కలెక్టరేట్ మైదానంలో 1000 మొక్కలు, 61 గ్రామ పంచాయతీల పరిధిలో 6,100 మొక్కలు, 13 పురపాలక సంఘాల పరిధిలో 30 వేల మొక్కలు, నారపల్లి అర్బన్ పార్కులో 5 వేల మొక్కలు నాటాలని నిర్ణయించారు. అలాగే.. జిల్లాలో జీహెచ్ఎంసీ పరిధిలోని మున్సిపల్ సర్కిళ్లలో కూడా వీలైనన్ని మొక్కలు నాటేందుకు సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, పారిశ్రామిక ప్రాంతాల్లోనూ మొక్కలు నాటేందుకు సిద్ధం చేస్తున్నారు. హరిత దినోత్సవ వేడుకల్లో భాగంగా జిల్లావ్యాప్తంగా మొత్తం 50 వేల మొక్కలు నాటాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

ఈ ఏడాదిలో 63.70 లక్షలు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఈ ఏడాది 63.70 లక్షల మొక్కలు నాటాలని నిర్ణయించారు. సామూహిక వనాల పెంపకానికి స్థల సేకరణలో ఆయా శాఖల అధికారులు నిమగ్నమయ్యారు. కాగా.. కలెక్టరేట్, నారపల్లి అర్బన్ పార్కుతో సహా పట్టణాలు, గ్రామాల్లో గుంతల తవ్వకాల పనులు ముమ్మరంగా చేపట్టారు. జిల్లాలో 63.70 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం విధించగా, దీనికి తగ్గట్టుగా అటవీ శాఖ తూముకుంట, కండ్లకోయ, దూలపల్లి ప్రాంతాల్లోని మూడు నర్సరీల్లో 8 లక్షల మొక్కలను పెంచగా, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ(డీఆర్డీఏ) ఆధ్వర్యంలో 59 గ్రామాల్లోని నర్సరీల్లో 30 లక్షల



మొక్కలు, 13 పురపాలక సంఘాల పరిధిలోని నర్సరీల్లో మరో 30 లక్షల మొక్కలను పెంచారు. ఈ ఏడాది గతంలోని మొక్కలతో పాటు టేకు, ఈత, వెదురు, మలబార్, ఇప్ప, మద్ది, వెలగ, మర్రి, వేప, రేల, బాదాం, రావి, చింత, తులసి, నిమ్మ, జామ, సీతాఫలం, ఖర్జూర, మందార, సన్నజాజి, మల్లె నాటేందుకు సిద్ధమయ్యారు.

సర్కారు స్థలాలు అన్యాక్రాంతం కాకుండా..

నగర శివారుల్లోని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో భూముల విలువ ఆకాశాన్ని అంటడంతో ధరలు అందనంత పెరిగిపోయాయి. దీంతో జిల్లాలోని ప్రభుత్వ, అసైన్డ్, అటవీ, చెరువు శిఖం భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. మరోవైపు ప్రభుత్వ స్థలాలనూ అక్రమార్కులు వదలడం లేదు. ఈ స్థలాలను రక్షించేందుకు అవసరాల నిమిత్తం సేకరించిన భూముల్లో మొక్కలు నాటనున్నారు. ఇప్పటికే ఆయా శాఖల అధికారులు రికార్డుల ఆధారంగా క్షేత్రస్థాయిలో హద్దులు నిర్ణయించి మొక్కలు నాటేందుకు జాబితా సిద్ధం చేశారు.

శరవేగంగా గుంతల తవ్వకాలు

గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధిహామీ కూలీలు మొక్కలు నాటేందుకు శరవేగంగా గుంతల తవ్వకాల పనులు చేపడుతున్నారు. సోమవారం మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభం కానుండటంతో రోజువారీగా గుంతల లక్ష్యాలు విధించారు. అయితే నర్సరీల్లో మొక్కల ఎదుగుదల ఆందోళన కలిగిస్తోంది. ఎన్నడూ లేని విధంగా ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరుగుతుండటంతో.. మొక్కల సంరక్షణకు జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యామ్నాయ చర్యలకు పూనుకోవాలని యోచిస్తోంది.

మొక్కల కొరత లేదు



తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని హరితోత్సవం కార్యక్రమంలో మొక్కలు నాటనున్నాం. నర్సరీల్లో పెద్ద సైజ్‌లో మొక్కలు అందుబాటులో ఉన్నాయి. మొక్కలకు ఎలాంటి కొరత లేదు. వేసవిలో నర్సరీల్లో మొక్కల ఎదుగుదలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం.

– అమయ్‌కుమార్, జిల్లా కలెక్టర్, మేడ్చల్-మల్కాజిగిరి

పెద్దఎత్తున మొక్కలు నాటాలి



- గ్రామాలు, పట్టణాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలి
- మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్

సాక్షి, మేడ్చల్ జిల్లా: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లాలోని అన్ని గ్రామాలు, పట్టణాల్లో హరితోత్సవాన్ని విజయవంతం చేయాలని మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్ కోరారు. జిల్లా వ్యాప్తంగా 61 గ్రామాలు, 13 పురపాలక సంఘాలు, జీహెచ్ఎంసీ పరిధిలోని మున్సిపల్ సర్కిళ్లు, పట్టణాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని ఆయన సూచించారు. అలాగే, నర్సరీలను సందర్శించాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, పారిశ్రామిక వాడల్లో తప్పకుండా మొక్కలు నాటాలన్నారు. సోమవారం ఉదయం 9:30 గంటలకు కలెక్టరేట్ ఆవరణలోని హరితోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక, ఉపాధికల్పన శాఖ మంత్రి మల్లారెడ్డి పాల్గొంటారన్నారు. గ్రీన్ కవర్ పెంచడంలో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో ఉందన్న విషయాన్ని పేర్కొనాలన్నారు. నాటిన మొక్కల వాటి వద్దకు విద్యార్థులను తీసుకెళ్లి చూపించాలని, దీంతో వారిలోనూ మొక్కలు నాటాలనే సానుకూల ఆలోచన వస్తుందన్నారు. విద్యాసంస్థల పరిసరాల్లో మొక్కలు నాటేలా విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు.

మందు తాగిన కోతిలా చిందులేస్తున్నారు..



చౌదరిగూడలో కాంగ్రెస్ నిరసన దీక్షలో మాట్లాడుతున్న టీ పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వజ్రేశ్‌యాదవ్

- అభివృద్ధికి లేని నిధులు సంబరాలకు ఎక్కడివి?
- సమస్యలు పరిష్కరించని మంత్రులు ఎందుకు..?
- టీ పీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేశ్‌యాదవ్ ఆగ్రహం

ఘట్‌కేసర్: అభివృద్ధి పనులు వదిలేసి దశాబ్ది ఉత్సవాల పేరుతో మందు తాగిన కోతిలా చిందులేస్తున్నారని, అభివృద్ధి పనులకు లేని నిధులు సంబరాలకు ఎక్కడివని టీ పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేశ్‌యాదవ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నారపల్లి-కొర్రెముల్ రోడ్డు పనుల్లో అలసత్వంపై చౌదరిగూడ గ్రామశాఖ అధ్యక్షుడు కట్ట ఆంజనేయులుగౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టిన నిరసన దీక్షకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంబరాల పేరుతో ప్రజల సొమ్మును వృథా చేయకుండా రోడ్లకు కేటాయిస్తే పనులు పూర్తవుతాయని అన్నారు. నిరసన చేపడితే అరెస్టులు చేస్తున్నారని, ప్రజల సమస్యలు పరిష్కరించని మంత్రులు ఎందుకని, ఆయన భరతం పట్టడానికే నిరసన దీక్ష చేపట్టామన్నారు. ఏడు నెలల క్రితం మంత్రి ప్రారంభించిన రోడ్డు పనులు ముందుకు సాగడం లేదని, బీఆర్ఎస్ పాలనలో నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోకపోవడం సిగ్గు చేటన్నారు. మంత్రి నియోజకవర్గంలో గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు ఎమ్మెల్యే నిధుల నుంచి పైసా విడుదల చేయలేదన్నారు. మంత్రి నిర్లక్ష్యం కారణంగా ఘట్‌కేసర్ రైల్వే వంతెన, మేడ్చల్‌లో డిగ్రీ కళాశాల ఏర్పాటు జాప్యం అవుతోందన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మంత్రి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ ఏ బ్లాక్ అధ్యక్షుడు పోచయ్య, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు సుశాంత్‌గౌడ్, బోడుప్పల్ కార్పొరేటర్ అంజయ్‌యాదవ్, వైస్ ఎంపీపీ జంగమ్మ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జంగయ్య, ఉపాధ్యక్షుడు బాబురావు, జవహర్‌నగర్ కార్పొరేషన్ అధ్యక్షుడు శ్రీకాంత్‌యాదవ్, పోచారం అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, భోజిరెడ్డి, ముత్యాలుయాదవ్, సుధాకర్, వాణి, రాజశేఖర్‌రెడ్డి, నర్సింగ్‌రావు ముదిరాజ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వినోద్, నాగేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

అనాథాశ్రమంలో పండ్ల పంపిణీ

బోడుప్పల్: బీఆర్ఎస్ బోడుప్పల్ అధ్యక్షుడు మంద సంజీవ్‌రెడ్డి, సునీత వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఎంఎస్ఆర్ యువసేన ఆధ్వర్యంలో ఆదివారం అనాథాశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. బాలాజీ హిల్స్ కాలనీలోని మహాకాళేశ్వర ఆలయంలో పూజలు నిర్వహించారు. ఆశా ఫౌండేషన్‌లో కేక్ కట్ చేసి అన్నదానం నిర్వహించారు. భారతమాత అనాథ ఆశ్రమంలో వృద్ధులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. శ్రీహరిగౌడ్, రాసాల బాలమల్లేష్ యాదవ్, సత్యమూర్తి యాదవ్, నాగేశ్వర్‌రావు, శేఖర్‌రాజు, శత్రుఘ్న, పాండు రంగ, మోతే రాజు, ఉప్పరి విజయ్, కుమార్ పాల్గొన్నారు.

తాగునీటికి కష్టాలు లేవు..



గోధుమకుంటలో ప్రమాణం చేస్తున్న సర్పంచ్ మహేందర్‌రెడ్డి, గ్రామకార్యదర్శి సురేష్‌రెడ్డి

కీసర: రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మండలంలోని వివిధ గ్రామాల్లో వాటర్‌డే దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నీటి ట్యాంకుల వద్ద సుందరంగా అలంకరించడంతో పాటు ముగ్గులను వేశారు. గతంలో గ్రామాల్లో నీటి కోసం యుద్ధాలు జరిగేవని, నేడు రాష్ట్రంలో ప్రజల తాగునీటి కష్టాలను తీర్చేందుకు సీఎం కేసీఆర్ మిషన్ భగీరథ పథకాన్ని తీసుకువచ్చాడన్నారు. ఎంపీపీ ఇందిరాలక్ష్మీనారాయణ, సర్పంచులు ఆకిటి మహేందర్‌రెడ్డి, నాయకపు మాధురి, సుంకరి కవితాజైహిందర్‌రెడ్డి, కొకుట్ల గోపాల్‌రెడ్డి, తుంగ ధర్మేందర్, పుట్ట రాజు, సత్తమ్మ, పెంటయ్య, విమల, గరుగుల అండాలుమల్లేష్, గ్రామకార్యదర్శులు సురేష్‌రెడ్డి, దివ్య, వెంకటేష్, గంగన్న తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలను నెరవేర్చాలి

ఘట్‌కేసర్: బడుగుల అభివృద్ధికి అంబేడ్కర్ నిరంతరం తపించారని స్థానిక ఆదర్శ యూత్ సభ్యులు మధు, శ్యామ్‌రెడ్డి, రాజు అన్నారు. అంబేడ్కర్ ఆలోచనా విధానాలు ప్రజల్లోకి తీసుకెళ్లడానికి పట్టణంలో ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ బాధ్యుడు అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అంబేడ్కర్ విగ్రహం పూలమాల కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అరుణ్‌కుమార్ మాట్లాడుతూ అంబేడ్కర్ బడుగు, బలహీన వర్గాల జీవితాల్లో మార్పు తీసుకురావడానికి కృషి చేశారని, ఆయన ఆశయాలను నెరవేద్దామన్నారు. కార్యక్రమంలో దాసు, నర్సింగ్‌రావు, బాలయ్య, జంగయ్య, శ్రీనివాస్, రాజేశ్, నారాయణ, సంతోశ్‌కుమార్, అంజయ్య, మహిపాల్, గణేశ్, మల్లేశ్, గిరిబాబు, దినేశ్ పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే..



మాట్లాడుతున్న చైర్ పర్సన్ పావనీయాదవ్

ఘట్‌కేసర్: బీసీ మహిళా చైర్ పర్సన్ చేసిన అభివృద్ధిని చూసి ఓర్వలేక అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్ పర్సన్ పావనీ యాదవ్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. అనంతరం తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జాతీయ స్థాయిలో రెండుసార్లు స్వచ్ఛ్ సర్వేక్షణ్ అవార్డు గెలుచుకున్న తనపై మహిళ అని చూడకుండా బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు, వైస్ చైర్మన్, నాలుగో వార్డు కౌన్సిలర్ ప్రోత్సాహంతో వారి అనుచరులు అబ్బాస్ అలీ ఆధ్వర్యంలో చైర్మన్ డౌన్ డౌన్ అంటూ, మున్సిపల్ కార్యాలయం ఎదుట దిష్టిబొమ్మను దహనం చేసి మహిళా ప్రజాప్రతినిధిని అవమానించారని అన్నారు. అలాగే ఎండీ సిరాజ్ అనే వ్యక్తి సోషల్ మీడియాలో బ్రేకింగ్ న్యూస్ అంటూ చైర్ పర్సన్‌పై అభ్యంతకరమైన పోస్టులతో రెచ్చగొట్టే విధంగా పెడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో నీకేమి పనంటూ నా భర్తను మూడు రోజుల క్రితం బెదిరించారని, 16వ తేదీన నారాయణ గార్డెన్‌లో నిర్వహించిన పట్టణ ప్రగతి కార్యక్రమం విజయవంతం కాకుండా అవాంతరాలు సృష్టించారని ఫిర్యాదులో తెలిపారు. చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

నట్టింట్లోకి నల్లానీరు తీసుకొచ్చాం..



జవహర్‌నగర్‌లో మంచినీళ్ల పండగ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి

- రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి
- దేశానికే మోడల్‌గా నిలిచిన మిషన్ భగీరథ
- బీజేపీ, కాంగ్రెస్‌లు తెలంగాణకు చేసిందేమీ లేదు
- బిందెలతో మహిళల ర్యాలీ, ఆకట్టుకున్న నృత్యాలు



జవహర్‌నగర్‌లో బిందెలతో ర్యాలీగా..

జవహర్‌నగర్: నట్టింట్లోకి నల్లానీరు అందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో ఆదివారం మంచినీళ్ల పండగ కార్యక్రమాన్ని మేయర్ కావ్య అధ్యక్షతన ఏర్పాటు చేశారు. బాలాజీనగర్‌లోని సీఎంఆర్ ఆస్పత్రి నుంచి కేసీఆర్ కూరగాయల మార్కెట్ వరకు వందలాది మహిళలు డప్పుచప్పుళ్లతో కోలాటాల నడుమ నీటి బిందెలతో మహిళలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా మిషన్ భగీరథ పథకాన్ని సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టి ప్రతిఇంటికీ నీరు అందిస్తున్నారన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌ను దేశంలోనే ఆదర్శవంతమైన పట్టణంగా తీర్చిదిద్దుతామన్నారు. మిషన్ భగీరథతో ప్రతి ఇంటికీ తాగునీరు అందుతోందని, కాంగ్రెస్, బీజేపీ నాయకులు చేసిందేమీలేదన్నారు. జవహర్‌నగర్‌లో డంపింగ్ యార్డ్‌ను తీసుకువచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. గతంలో తాగునీటి కోసం కిలోమీటర్లు నడిచేవారని ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, కమిషనర్ రామలింగం, హెచ్ఎండబ్ల్యూ అధికారులు, కోఆప్షన్ సభ్యులు, ఆర్వో ప్రభాకర్‌యాదవ్, టీఆర్ఎస్ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్‌తో పాటు మహిళలు, టీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఉమ్మడి రాష్ట్రంలో ఎన్నో ఇబ్బందులు

మేడ్చల్‌రూరల్: రాష్ట్రంలోని ప్రతి గడపకీ నీళ్లు అందించిన ఘనుడు సీఎం కేసీఆర్ అని మంత్రి మల్లారెడ్డి అన్నారు. మండలంలోని డబిల్‌పూర్ గ్రామంలో నిర్వహించిన మంచి నీళ్ల పండగ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో నీళ్ల కోసం మహిళలు ఎన్నో ఇబ్బందులు పడేవారన్నారు. ఎంపీపీ రజితరాజమల్లారెడ్డి, జెడ్పీటీసీ శైలజ, జెడ్పీ సీఈఓ దేవసహాయం, జిల్లా రైతుబంధు అధ్యక్షుడు నందారెడ్డి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటేశ్, మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీర్ మధుబాబు, ఈఈ వంశీకృష్ణ, డీఈఈ రామకృష్ణ, రాజ్‌కుమార్, ఎంపీడీఓ పద్మావతి, పీఏసీఎస్ చైర్మన్ సురేశ్ రెడ్డి, మాజీ సర్పంచులు రాజమల్లారెడ్డి, జగన్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దయానంద్ యాదవ్, పలు సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో భారీగా పాల్గొన్న మహిళలు